# పెంచిన ప్రేమ

భూపాల్

**మా** ఆఫీసు కోసం ఓ మేడ అద్దెకు తీసుకున్నాం. ఆ మేడ కట్టిన నాటి నుండే అక్కడ కాపలాదారుగా చెన్నయ్య ఉన్నాడట. ఎప్పుడైతే ఆ బిల్డింగ్ అద్దెకు తీసుకున్నామో, దాని కాపలాదారుకి కూడా మేమే జీతమివ్వాలి. ఆ ఇంటి స్వంతదారు ఇంటిని మాకు అప్పగిస్తూ "ఈ 'చెన్నయ్య' అని ఉన్నాడు చూడండీ అతని విషయంలో మీరు జాగ్రత్తగా ఉండాలి. నమ్మొద్దు. చిన్న చిన్న దొంగతనాలు చేస్తుంటాడు. అతన్ని ఉంచుకున్నా, తోసేసినా మీ ఇష్టం" అని చెప్పింది.

చెన్నయ్య ఆ ఇంటి వెనకాల చిన్నగా ఉన్న రెండు సిమెంట్ రేకుల పాటి గదిలో ఉంటున్నాడు ఒక్కడే. ఆ గదికి కప్పుసైతం సరిగా లేదు. ఒంటిరెక్క తలుపు బేడం కూడా నోచుకోలేదు. ఏదో వైరు కట్టి, చుట్టి నడిపిస్తున్నాడు. చెన్నయ్య వృద్ధుడనే కాదు, ఓ కన్ను పూర్తిగా కనిపించదు. వేర్వేరుగా ఇద్దరు వ్యక్తులు ఆఫీసుకి వచ్చి వెళితే రెండుమార్లూ ఒకే'సారు' వచ్చి వెళ్ళాడని చెపుతాడు కానీ, వ్యక్తిని గుర్తించడు. భార్యా, పిల్లలు ఏవో పనులు చేసుకుంటూ అడ్డగుట్టలో ఉన్నారని చెపుతాడు. అతను దొంగతనాలు చేస్తాడని మాత్రం మేము అనుకోలేదు. ఒక్కోసారి అతనికి ఆఫీసంతా వదిలేసి సాయంత్రం వరకూ వేరే పనుల మీద వెళ్ళివచ్చినా ఏ వస్తువూ ఎప్పుడూ ముట్టేవాడు కాదు.

అక్కడ మేం స్థిరపడి రెండు సంవత్సరాలు పూర్తికావొస్తున్నాయి. మా ఆఫీసు ముందు కొంచెం ఖాళీ స్థలముంది. ఆ వీధిలో అదే చివర మూల, ఇకపైకి దారిలేదు కనుక పక్క మేడ గోడవాలుగా చెన్నయ్య ఓ పొప్పాయి (పొప్పడి) మొక్కను నాటాడు. దాని ఎదురుగా చిన్న పాలకురిసె చెట్టు అదే మొలిచింది. రెండు చెట్లు పచ్చగా ముచ్చటగా వున్నాయి. వాటిని చెన్నయ్యే జాగ్రత్తగా పెంచుతున్నాడు. పాలకురిసె చెట్టు పాలు ఒకరిద్దరికి ఔషధంగా ఇవ్వగా నేనూ చూశాను. ఒక పొప్పడి చెట్టు సంవత్సరం నుండి కాయలు కాసి, పండ్లనూ ఇస్తోంది. కాస్తున్న పండ్లను అతను తెంపుకుంటున్నాడనీ, తన కొడుక్కీ, తన భార్యకూ పంపిస్తున్నాడనీ తెలుసు. అయినా ఆఫీస్ బాయ్ ఒకసారి "అది మన ఆఫీస్ చెట్టు సార్. పండ్లు మనమే తెంపుకుందాం" అన్నాడు. "ఆ మాత్రం దానికి కక్కుర్తి పడడం ఎందుకూ? చెన్నయ్య కూడా మనవాడే కదా తిననీ, చెట్లను తానే పెంచుకున్నాడు" అన్నాను.

చెన్నయ్య జాగ్రత్త మనిషే. అయినా అతని కన్ను కప్పి ఉండడం చూసి ఎవరో సర్వెంట్ బాత్ రూం నుండి నల్లానూ, ఒక నాబ్‌నూ దొంగిలించారు. అది చూసి ఇక తన గదిలో నుండి తలే, చెంబూ కూడా ఎవరో ఎత్తుకెళతారని ఆ ఒంటి రెక్క తలుపుకి బేడం (అరదండా) తెచ్చి బిగించాడు. చిన్న తాళం కొని వేసుకున్నాడు.

ఇక ఈ మధ్య ఇంటి స్వంతదారులు మేడపైన మరో రెండు అంతస్తులు కడదామని పని ప్రారంభించారు. అందుకుగాను వాళ్లకు నమ్మకమైన మనిషిని, భార్యా పిల్లలు తోడుగలవాన్ని కాపలాదారుగా తెచ్చుకున్నారు. వాళ్లు ఉండేందుకు మరో గది లేదు కనుక ఈ చెన్నయ్యకు ఉద్వాసన చెప్పవలసి వచ్చింది. ఇక మేమూ ఏం చేయలేం. ఉన్న విషయం వివరించి కొంత డబ్బు అదనంగా ఇచ్చి, ఇక నీవు నీ గది ఖాళీ చేసి వెళ్లిపోయి మరోపని చూసుకోవలసిందిగా చెప్పాం.

అతను ఏ మాత్రం బాధపడకుండా సరే అన్నాడు. ఈ వయసులో భార్యా పిల్లలతో ఉండడమే మేలనుకున్నాడో



ఏమో 'సరే' అంటూనే "సారూ! మరి నేను నా కోటీడుకి అరదండ (బేడం) నలభై ఐదు రూపాయలు పెట్టి కొని ఏసిన, తాళం ఏసిన అవి రెండూ ఊడ దీసుకొని పోతా" అన్నాడు.

"తలుపు రెక్కకు బిగించిన దాన్ని ఊడదీసుకొనిపోవడమేందయ్యా?" అన్నాను.

"మరి మీరు పైసలిస్తే ఉంచేస్త"

"అది ఇంటి ఓనర్స్ చేయవలసిన పని నీవు చేశానంటావ్. దాన్నేం తీయకు ఆ డబ్బు నేనిస్తాన"ని చెప్పి దాంట్లో ఉండే వాళ్లతోనే ఇప్పించాను. తాళం కవ్వ తీసికెళ్లాను.

మరునాడు నేను ఆఫీసుకి వెళ్లగానే మళ్లీ వచ్చి కూర్చున్నాడు. కొత్తగా వచ్చిన చౌకీదార్ (కాపలాదారు) కూడా వున్నాడు. అతని భార్యా వుంది. ఏదో జరిగినట్టు, ఏమో మాటలు వాళ్లు అనుకున్నట్టుంది ఆ వాతావరణం. నన్ను చూసి అందరూ మౌనం వహించారు.

"ఏం చెన్నయ్యా ఏం కథా?" అన్నాను.

"ఏం లేదు సార్! తను మొక్కనాటి నీళ్లు పోసి పెద్ద చేసిన చెట్టట ఈ పొప్పడి చెట్టు. దాని పండ్లు ఇక నుండి నువ్వే తింటావ్‌గదా! నాకేమన్నా పైసలియ్యి. లేదా దాన్ని నరికేసి పోతానని నా తోటి కొట్లాడుతుండు" అన్నాడు కొత్త చౌకీదార్.

నాకు తల తిరిగినంత పనైంది. ఏం మాట్లాడాలో తోచకుంది. చెన్నయ్య దిక్కు చూస్తున్నాను.

"చెన్నయ్యా? చెట్టు నువ్వు పెడితే పెట్టొచ్చు. మరి భూమి నీదా? భూమి లేకుంటే చెట్టు పెట్టెటోనివా? ఈ సారు భూమికి కిరాయి కడ్తున్నాడు, నల్ల నీళ్లకు పైసలు లిస్తున్నాడు. సారు పైస లియ్యకుంటే నువ్వు చెట్టును పెంచెటోనివా? నీళ్లు పోసెటోనివా? తిన్న పండ్లు సాలు ఇగ జగడం చెయ్యక సక్కగ పో". మళ్ళీ అన్నాడు కొత్త చౌకీదారే.

"భూమి నాది కాదు, ఇగ నీళ్లూ నాయిగావు. అవాటిని నేను తీస్కోపోతనంటలేను. ఆ చెట్టును నేను పెంచి పెద్ద చేసిన గద! ఏమన్న పైసలియ్యమంటున్న" అని నా దిక్కు చూస్తూ "కాదు సార్! ఇన్నేండ్ల నుంచి నేను సూసింది పోయ్యింది. ఒండి పెట్టిన బువ్వకాడ కొచ్చినట్టు అదు సూదుండ్రి పండ్లు ఎట్లున్నవో! అవి తినేటందుకే ఈన వచ్చినట్లుగదా" అన్నాడు చెన్నయ్య చెట్టు కేసి పైన పచ్చగా మెరుస్తున్న పండ్లను చూ[illegible].

"ఓ! ముసలయన ఇంతపాటి తెలివి [illegible]కెవ్వరికీ లేదనుకోకు. ఒక్కటి సప్పరిస్తినా ఈపు మీద మల్ల ఇటెంక్ల కనబడవు. లోకంలో లేని సోద్యం చెప్పవట్టివీ! చెట్టు పెంచిండట. కొడుకును గనలే! అదు బువ్వ పెట్టకుంటే నిలువున నరికి సంపుతానంటవా? మేం రొండు రోజులు జూస్తిమిగా! బువ్వ లేకున్నా పంతివిగాని, కొడుకునో మాట అనకపోతివి. అవ్వ! వచ్చని చెట్టును నరుకుతానని వచ్చినవూ! వారె తెలివి." అని గట్టిగానే అంటూ "సారూ! ఇదంతా మీరిచ్చిన అలుసే! రెండు దన్ని రోడ్డు మీదికి నూకక" అంది నావైపు చూస్తూ చౌకీదార్ భార్య.

ఇక ఏం తీర్పు చెప్పాలో నాకు తోచకుంది. "చెన్నయ్యా! నువ్వు పెట్టి పెద్దచేసి పోషించిన చెట్టు ఇది అనే అంటవ్! సరే! ఈ చెట్టు నీదే అయితే కానీ, నీ ఉపాయం బాగుంది. ఇకపోతే ఇది ఇంకా ఎన్ని కాయలు కాస్తుందో? నీకు ఎంత పైసరావాల్నో చెప్తనంటవా" అన్నాడు మా పక్క ఆఫీసు గుమాస్తా.

"ఏంది సార్ ఆనికిచ్చేది? మీరు గూడా బాగ జెప్తరూ, చెట్లు ఆనిదైతే భూమెవ్వరిదీ! అట్ల జూసినా భూమిపాలు మనకొస్తది. ఇంతవరకు తిన్నది అదు, ఇక తినేది మనము. ఇదీ ముసలిదైంది ఎంతకాలం బతుకుతాడో చెప్పలేం. ఆ తీర్గ జూస్తే ఈ ముసలోడే మనకు పైసలిచ్చిపోవాలి! ఎందో ఉల్టమననియ్యమంటడూ" అన్నాడు చౌకీదార్ కోపంతో.

ఇతడి లాజిక్ కూడా వినాల్సిందే.

చెన్నయ్య అతని దిక్కు కోపం మీరిపోయి చూస్తున్నాడు. అది గమనించిన చౌకీదార్‌భార్య "అది కాదు సార్" అంటూ నోరు మరికాస్త పెంచి ఏమో చెప్పపోయింది.

ఇక ఇంకా ఈ గొడవ పెరిగి లాభం లేదు. ఎలాగో చెన్నయ్యను పంపించడమే మంచి మార్గంగా తలచాను. వెంటనే వంద రూపాయల కాగితం తీసి చెన్నయ్యకిచ్చి వెళ్ళిపొమ్మన్నాను.

చెన్నయ్య తిరిగి చూడకుండా వెళ్లిపోయాడు. అక్కడున్న వాళ్లంతా, గొడవ వినడానికొచ్చిన వాళ్ళంతా నన్ను వింతగా చూశారు. కొందరు చెన్నయ్యను తిడుతున్నారు.

చెన్నయ్యకు డబ్బు ఇవ్వక నెట్టేస్తే ఏ రాత్రో ఎప్పుడో వచ్చి ఆ చెట్టును నరికేసిపోతాడని నాకు తెలుసు.